

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365



| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక: 43 | మంగళవారం | 8 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue: 43 | Tuesday | 8.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |




2లో

## లెబనాన్‌పై విరుచుకపడ్డ ఇజ్రాయెల్..
# 11 మంది మృతి



# కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

### అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడిని శాశ్వతంగా బర్తరఫ్ చేయాలి: శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

### 22ఏపై చర్చకు పట్టుబట్టిన బీజేపీ.. స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ ముఖ్యమన్న అధికార పక్షం

రాష్ట్రానికే ఇది చీకటి రోజని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అవమానకర వ్యాఖ్యలు..నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానంగా ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీలకు అతీతంగా సభలోని ప్రతి సభ్యుడు ఈ వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని, అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడి సభ్యత్వాన్ని శాశ్వతంగా బర్తరఫ్ చేయాలని సీఎం డిమాండ్ చేశారు. శాసనసభ ప్రాంగణంలో తాతా మధు చేసిన వ్యాఖ్యలు సోమవారం తీవ్ర దుమారం రేపాయి. భోజన విరామం తర్వాత శాసనసభ మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైంది. తాతా మధు వ్యాఖ్యలపై సుదీర్ఘ చర్చ జరగాలని సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. అప్పటికే బీజేపీ సభ్యులు 22ఏ పై చర్చ చేపట్టాలని పట్టుబట్టారు. ప్లకార్డులతో బైఠాయించారు. బీఏసీలో చర్చ తర్వాత

- మిగతా 2వ పేజీలో

## అసెంబ్లీ వద్ద తోపులాట..
# తీవ్ర ఉద్రిక్తత

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీసుల మధ్య వాగ్వాదం
- అక్కడే బైఠాయించి బీఆర్ఎస్ నిరసన..నినాదాలు
- తోపులాటలో కిందపడిన నేతలు.. జగదీశ్‌రెడ్డికి అస్వస్థత
- మహిళా నేతల ఆవేదన.. విలపించిన సునీతా లక్ష్మారెడ్డి
- హరీశ్, కేటీఆర్ సహా నేతల అరెస్టు.. తెలంగాణ భవన్‌కు తరలింపు
- బీఏసీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన హరీశ్‌రావు









హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డు కోవడం తోపులాటకు దారితీసింది. నేతలు కింద పడిపోవడం, అస్వస్థతకు గురికావడం, నిరసనలు, నినాదాలు, అదుపులోకి తీసుకోవడం వంటి ఘటనలకు దారి తీసింది. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ మండిపడింది. సభలో అడుగు పెట్టక ముందే తమను అడ్డుకుని, తమ పార్టీ సభ్యులపై పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడిందని ఆరోపించింది. పోలీసులు తమపై అనుచితంగా ప్రవర్తించారని, మహిళా ఎమ్మెల్యేల గొంతు పిసికారని, చీరలు లాగారనే ఆరోపణలతో వివాదం మరింత ముదిరింది. ఇది శాసనసభా? కౌరవసభా? అని బీఆర్ఎస్ నిలదీసింది. మరోవైపు పోలీసులతో జరిగిన వాగ్వాదం సందర్భంగా శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అధికార పక్షం మండిపడింది. సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. సదరు సభ్యుడితో రాజీనామా చేయించి, ప్రతిపక్ష నేత బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యులు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే తమపై జరిగిన దాడికి సీఎం రేవంత్‌రెడ్డే

- మిగతా 2వ పేజీలో



# అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్

- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన

తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

- మిగతా 2వ పేజీలో

## నా రిటైర్మెంట్ వరకు గడువు
# అడుగుతారా ఏంటి?

- ఆరావళి కమిటీ పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు పొడిగింపును తిరస్కరించిన ధర్మాసనం
- నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదిక సమర్పించాలని స్పష్టమైన ఆదేశం
- గడువులోగా పూర్తిచేయకుంటే కమిటీని పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక
- అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని కమిటీకి సూచించిన కోర్టు



2లో

# కార్యకర్తలే పార్టీకి బలం..

- వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి: లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు
- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు

- మిగతా 2వ పేజీలో





# భవన యజమాని అరెస్ట్

- ఢిల్లీ ఘటనలో ఏడుకు పెరిగిన మరణాలు
- ముగిసిన రెస్క్యూ ఆపరేషన్
- సౌత్‌జోన్ డిప్యూటీ కమిషనర్, నలుగురు ఇంజనీర్ల సస్పెన్షన్

2లో

# అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

- మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు: విజయసాయిరెడ్డి
- ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి
- రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న
- తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి



# అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

"అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

# లెబనాన్‌పై విరుచుకపడ్డ ఇజ్రాయెల్.. 11 మంది మృతి

బీరుట్: లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకపడింది. ఈ రోజు (సోమవారం) దక్షిణ లెబనాన్‌లోని రెమాన్ నగరంలోని ఓ భవనంపై మిసైల్స్‌తో దాడి చేసింది. ఈ దాడిలో 11 మంది మృతిచెందగా వారిలో ఇద్దరు చిన్నారులతో పాటు, వైద్య సిబ్బంది ఉన్నారు. ఈ వివరాలను ఆ లెబనాన్‌కు చెందిన నేషనల్ న్యూస్ ఏజెన్సీ ప్రకటించింది. ఆ దేశ మీడియా కథనాల ప్రకారం... సోమవారం తెల్లవారుజామున దక్షిణ లెబనాన్‌లోని క్ఫర్ రెమాన్ పట్టణంలో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఒక నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేశాయి. ఈ దాడిలో ఇద్దరు చిన్నారులు సహా తొమ్మిది మంది మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారు అని కథనాలు ప్రచురించాయి. ఇదే పట్టణంలో మరో ఘటనలో ఇజ్రాయెల్‌కు చెందిన డ్రోన్ ఒక పౌర వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని బాంబు దాడి చేసింది. ఆ కారులో ఉన్న ఇద్దరు వైద్య సిబ్బంది మరణించినట్లు బీబీసీ తెలిపింది. అదే విధంగా దేర్ అల్-జహ్రానీ పట్టణంలోని ఒక నివాస ప్రాంతంపై కూడా ఇజ్రాయెల్ సైన్యం రాత్రివేళ దాడి చేసిందని ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ముందుగా ప్రజలను ఆదేశించిందని తెలిపింది. కాగా ఈ దాడులకు ఒక రోజు ముందు, సమీపంలోని అరబ్ సలీమ్ పట్టణంపై జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో కనీసం ఏడుగురు మరణించగా, మరో 20 మంది గాయపడ్డారు. ఈ పట్టణం కూడా నబతియెహ్ జిల్లాలోనే ఉంది. అయితే ఈ ఏడాది జూన్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ తరచుగా ఈ ఒప్పందం ఉల్లంఘన జరుగుతుంది. ఇటీవల కాలంలో ఇజ్రాయెల్ తరచుగా లెబనాన్‌పై దాడులకు తెగబడుతుంది.

# అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్

(మొదటి పేజీ తరువాయి)

సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

# భవన యజమాని అరెస్ట్

న్యూఢిల్లీ: విద్యాభ్యాసం, ఉపాధి కోసం వచ్చి పాత హాస్టల్ భవనంలో తలదాచుకున్న విద్యార్థులు, యువత భవిష్యత్తును అంధకారం చేస్తూ పేకమేడలా ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో భవన యజమాని కుటుంబాన్ని పోలీసులు అరెస్ట్‌చేశారు. కూలిన భవన యజమాని అయిన మాజీ భారత వాయుసేన సార్జెంట్, 81 ఏళ్ల హరిరామ్ గుప్తా, ఆయన భార్య ఊర్మిళ(75), కుమారుడు మహేశ్(52)లను ఢిల్లీ పోలీసులు అరెస్ట్‌చేశారు. పారిపోతున్న హరిరామ్‌ను హరియాణా--రాజస్తాన్ సరిహద్దుల్లోని భీవాడీలో పోలీసులు పట్టుకున్నారు. భవనం పాడవుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించినందుకు, పలువురి మరణాలకు కారణమైనందుకు వీళ్లపై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. పేయింగ్ గెస్ట్ భవనాన్ని హరిరాం, అతని కుమారుడు నిర్వహిస్తున్నారు. భవనం భార్య పేరిట ఉంది. మరోవైపు భవనం కూలిన ఘటనలో మరణాల సంఖ్య ఏడుకు పెరిగింది. 27 గంటలపాటు నిరాటంకంగా కొనసాగిన అన్వేషణ, సహాయక చర్యలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఘటన జరిగినప్పటి నుంచి మొత్తంగా 12 మందిని శిథిలాల నుంచి అతికష్టంమీద బయటకు తీశారు. వీరిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మిగతా వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం సమీప సత్య నికేతన్ ప్రాంతంలో బాయ్స్ పేయింగ్ గెస్ట్ భవనం కూలిన ఘటనపై ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) సారథ్యంలో ఉన్నతస్థాయి విచారణ జరపాలని ఢిల్లీ హైకోర్టు సోమవారం ఆదేశాలిచ్చింది.

# అసెంబ్లీ వద్ద తోపులాట..తీవ్ర ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత వహించాలని, హోంమంత్రిగానూ వ్యవహరిస్తున్న ఆయనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశాన్ని ఆ పార్టీ బహిష్కరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్తున్న క్రమంలో చోటుచేసుకున్న ఘటనలు అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ నడుమ సభ లోపలా, బయటా ఆరోపణలు, విమర్శలు, పరస్పర సవాళ్లకు తెరతీశాయి. సోమవారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్కు వద్ద ఉన్న అమరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే□లు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు నేతృత్వంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశాలకు హాజరయ్యేందుకు నల్లని టీషర్టులు ధరించి, నినాదాలు చేస్తూ అసెంబ్లీ మెయిన్ గేటు వద్దకు చేరుకున్నారు. 'హామీల అమల్లో కాంగ్రెస్ వైఫల్యం.. వెయ్యి రోజుల పాలన నిష్ఫలం' అంటూ టీషర్టులపై నినాదాలు ఉండటంతో పోలీసులు అభ్యంతరం తెలిపారు. బీఆర్ఎస్ సభ్యు□లు లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో మెయిన్ గేటు వద్ద బైఠాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అసెంబ్లీలోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో హరీశ్□రావు వాగ్వివాదానికి దిగారు. ఆ సమయంలో జరిగిన తోపులాటలో హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారు. దీంతో ఆగ్రహించిన



హరీశ్‌రావు తాను ధరించిన నల్ల టీ షర్టు□ను విప్పి విసిరేశారు. ఎలాంటి నినాదాలు లేనందున తన□ను అసెంబ్లీలోకి వెళ్లేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి కూడా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పోలీసు వాహనంలో తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీ వద్ద పోలీసుల తోపులాటలో హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారు. జగదీశ్‌రెడ్డి అస్వస్థతకు గురికాగా.. ఎమ్మెల్యేలు సుదీర్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు సపర్యలు చేశారు. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కేటీఆర్‌ను పోలీసులు బలవంతంగా వాహనంలోకి ఎక్కించడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి పోలీసుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జుట్టు పట్టుకుని, గొంతు నొక్కారని సబిత ఆరోపించగా, తన చీర లాగారంటూ సునీత కన్నీటి పర్యంతమయ్యారు. సబిత, సునీత, కోవా లక్ష్మితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాధవరం కృష్ణారావు తదితరులు అసెంబ్లీ గేటు వద్ద బైఠాయించగా వారినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

# కార్యకర్తలే పార్టీకి బలం..

(మొదటి పేజీ తరువాయి)

కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.



# నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా ఏంటి?

ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, పరిరక్షణపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ (హెచ్ పీసీ) పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. తుది నివేదిక సమర్పణకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు కావాలని కమిటీ కోరడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఈ అభ్యర్థనను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం, నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించి తీరాలని సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువును పొడిగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కమిటీ కోరిన గడువు (2027 ఫిబ్రవరి 28) తన పదవీ విరమణ తేదీ తర్వాత ఉందని సీజేఐ చురక అంటించారు. "కమిటీ ప్రాథమికంగా నా పదవీ విరమణ వరకు వాయిదా కోరినట్లుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి గడువులోగా నివేదికను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించడంలో విఫలమైతే, కమిటీని పునర్వ్యవస్థీకరించే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ, మధ్యంతర నివేదిక సిద్ధంగా ఉందని తెలిపారు. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన సంఘాలతో సహా అన్ని వర్గాల అభిప్రాయాలను సమగ్రంగా తీసుకోవడానికి అదనపు సమయం అవసరమని కోరారు. అయితే, ఆరు నెలల గడువు పొడిగింపు అభ్యర్థనను తిరస్కరించిన కోర్టు, కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చింది. నివేదికను ఖరారు చేసే ముందు అన్ని వర్గాలతో సమర్థవంతంగా సంప్రదింపులు జరపాలని కమిటీకి సూచించింది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు సుప్రీంకోర్టు ఈ ఏడాది జూన్‌లో ఐదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ఐసీఎఫ్ఆర్ఈ) డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని ఈ కమిటీ వాస్తవానికి ఆగస్టు 31 నాటికే నివేదిక ఇవ్వాల్సి ఉంది. పర్వత శ్రేణిగా గుర్తించాలంటే కనీసం 100 మీటర్ల ఎత్తు ఉండాలన్న నిబంధన వల్ల పర్యావరణపరంగా కీలకమైన ప్రాంతాలు పరిరక్షణ చట్రం నుంచి బయటకు వెళ్లే ప్రమాదం ఉందని గతంలో సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక కీలకంగా మారింది.

# కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశాన్ని చేపడదామని, స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ అత్యంత ముఖ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ దశలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మాట్లాడారు.

**బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారనే అనుమానం కలిగించొద్దు**

'స్పీకర్ పదవి అంత అత్యున్నతమైనది. అన్ని పార్టీల మద్దతుతో ఆ స్థానంలో కూర్చున్న వ్యక్తిని గౌరవించడం అందరి బాధ్యత. సభలో సీఎం అయినా, శాసనసభ్యుడైనా సభాపతికి ఒకే రకమైన అభిప్రాయం ఉంటుంది. అలాంటి స్పీకర్ మనసు ఓ ఎమ్మెల్సీ వ్యాఖ్యల వల్ల గాయపడింది. దీన్ని గడ్డం ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానంగానే చూడకూడదు. యావత్ తెలంగాణ సిగ్గుపడే ఘటన ఇది. మనుషులు ప్రయోగించలేని, సభ్య సమాజం సహించలేని భాష వాడి, అత్యంత అవమానకరంగా మాట్లాడిన తర్వాత ఇంతకన్నా చర్చనీయాంశం మరొకటి ఉండదని బీజేపీ గుర్తించాలి. చర్చలో పాల్గొనకుండా బీఆర్ఎస్ దుర్మార్గాలను కాపాడుతున్నారనే అనుమానం ప్రజలకు కలిగేలా వ్యవహరించవద్దు. అసెంబ్లీ సమావేశాలకు ముందు రోజు బీఆర్ఎస్ నాయకుడు ఫాంహౌస్‌లో సమావేశం ఏర్పాటు



చేసి తన సభ్యును పురిగొల్పారు. పోలీసులపై దాడి చేసి, సభాపతిని దూషించడమంటే క్షమించరాని నేరం. ఇది అనాలోచిత చర్య కాదు.. తీవ్రమైన నేరం. సభా ప్రాంగణంలో సభాపతితో పాటు కుటుంబ సభ్యులను అవమానించారు. బీఆర్ఎస్ పుట్టినప్పుడు, విజయం సాధించినప్పుడు దళితులనే ఆయుధంగా వాడారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎంను చేస్తానని, దళితులకు మూడెకరాలు భూమి ఇస్తానని నమ్మించి, దళిత బంధు ఇస్తానని నమ్మించిన పార్టీ బీఆర్ఎస్. అధికారంలోకి వచ్చాక దళిత ఉప ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారు. నేరెళ్లలో ఇసుక లారీలను అడ్డుకున్న దళితులను లారీలతో తొక్కించి చంపారు. ఒక దళితుడిని కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిని చేస్తే పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించి ప్రతిపక్ష హోదా లేకుండా చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది. ఆ పార్టీది దళిత వ్యతిరేక ఆలోచన. తల్లిని దూషిస్తే ఏ కొడుక్కయినా రక్తం మరుగుతుంది ఇలాంటి సంఘటన స్వాతంత్ర్యం వచ్చినప్పట్నుంచీ ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. ఇలాంటి పోకడలను నియంత్రించకపోతే రాబోయే తరాలు ఈ సభను కూడా క్షమించవు. తల్లిని అవమానించే విధంగా మాట్లాడితే ఏ కొడుక్కయినా రక్తం మరుగుతుంది. ఇలాంటి చర్యను ముక్త కంఠంతో ఖండించాలి. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటే కఠినంగా వ్యహరించాల్సిన అవసరం ఉంది. విశృంఖలత్వం, అడ్డగోలుతనం, ఏం మాట్లాడినా చెల్లుతుందనే అహంకారం, ఏం చేసినా చూసుకోవడానికి ఫాం హౌస్‌లో తమ నాయకుడు ఉన్నాడనుకునే వాళ్ళకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. క్షమించి ఊరుకుంటే చట్టసభలకు విలువ ఉండదు. దీనిపై చర్చించి స్వయం నియంత్రణ విధానం తేవాలి..'అని ముఖ్యమంత్రి అన్నారు.

# నర్సింగ్ ఆఫీసర్ల సంక్షేమానికి మరో ముందడుగు

- ప్రభుత్వ చర్యలకు నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వాగతం
- సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర అధ్యక్షుడు నోముల సూర్యనారాయణ



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** నర్సింగ్ ఆఫీసర్ల సంక్షేమం, భద్రత, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వాగతించింది. ప్రత్యేక నర్సింగ్ హాస్టళ్ల ఏర్పాటు, మహిళా నర్సింగ్ ఆఫీసర్ల భద్రత, ఉద్యోగుల సంక్షేమం, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం అభినందనీయమని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నోముల సూర్యనారాయణ అన్నారు. వైద్య రంగంలో నర్సింగ్ ఆఫీసర్లు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి అసోసియేషన్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్ల హక్కులు, గౌరవం, భద్రత, సంక్షేమం కోసం అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని సూర్యనారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి భవిష్యత్తులో మరిన్ని సానుకూల నిర్ణయాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే గౌస్, కోశాధికారి అనిల్‌కుమార్, ప్రచార కార్యదర్శి శ్వేత, ఉపాధ్యక్షులు రమ్య, బిందు, ముఖ్య సలహాదారు గురు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంబేద్కర్, సహాయ కోశాధికారి మధు, సహాయ ప్రచార కార్యదర్శి లత, జాయింట్ సెక్రటరీలు ప్రసాద్, దేవేందర్, న్యాయ సలహాదారు భారతి, సహాయ ప్రచార కార్యదర్శి శ్రేయ, కోఆర్డినేటర్లు రమేష్, సుజాతతో పాటు వివిధ జిల్లాల ప్రతినిధులు, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# రామన్నపేట మండలానికి 'విద్యుత్' వెలుగులు

- రూ.3.62 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన
- మునిపంపులలో రూపుదిద్దుకోనున్న నూతన సబ్‌స్టేషన్
- లో-వోల్టేజీ సమస్యలకు చెక్.. 1,546 వ్యవసాయ పంపుసెట్లకు, 2,400 ఇళ్లకు ప్రయోజనం

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల ప్రజలకు విద్యుత్ సమస్యల నుంచి ఉపశమనం కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. మండల పరిధిలోని మునిపంపుల గ్రామంలో రూ.3.62 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఎనూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే మండలంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కానుందని అధికారులు తెలిపారు. నాలుగు ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయడంతో వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా మండల పరిధిలోని 1,546 వ్యవసాయ పంపుసెట్లకు, 2,400 గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా లో-వోల్టేజీ సమస్యలు తగ్గడంతో పాటు ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లపై విద్యుత్ భారం తగ్గనుంది. దీంతో రైతులకు వ్యవసాయ అవసరాల కోసం మెరుగైన విద్యుత్ సరఫరా అందే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

**స్థల దాతకు అభినందనలు:**

సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా దానం చేసిన పల్లివాడ గ్రామానికి చెందిన గంగుల వెంకటరాజిరెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా ప్రయోజనాల కోసం విలువైన స్థలాన్ని ముందుకు వచ్చి దానం చేయడం అభినందనీయమన్నారు. నూతన సబ్‌స్టేషన్ నిర్మాణంతో రామన్నపేట మండలంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడి, రైతులు, గృహ వినియోగదారుల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.








# చందానగర్‌లో నేత్రదానంపై చైతన్య ర్యాలీ

- 'మీ నేత్రదానం.. మరొకరికి చూపు ప్రసాదం'

**తొలివెలుగు, చందానగర్:** నేత్రదానంపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించి, సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించేందుకు చందానగర్‌లోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం భారీ నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ర్యాలీని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరణానంతరం చేసే నేత్రదానం మరొకరి జీవితంలో చీకట్లను తొలగించి కొత్త వెలుగులు నింపుతుందని అన్నారు. 'మీ నేత్రదానం.. మరొకరికి చూపు ప్రసాదం' అనే సందేశంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ స్నేహిత, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శైలజ, డాక్టర్ రేష్మ పాల్గొని నేత్రదానం ప్రాముఖ్యత, దానిపై ఉన్న శాస్త్రీయ అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రదాన ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ యాజమాన్య ప్రతినిధులు ప్రసాద్, అభిలాష్, ఐ బ్యాంక్ ప్రతినిధి అరవింద్, ఆసుపత్రి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- 'చలో ఇందిరాపార్క్' కు వెళ్లకుండా బీజేపీ నేతల ముందస్తు అరెస్టు
- పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే నిరసన హోరు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** రాష్ట్రవ్యాప్తంగా బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన 'చలో ఇందిరాపార్క్' కార్యక్రమానికి తరలివెళ్లకుండా భూదాన్ పోచంపల్లి ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని నిరసిస్తూ నాయకులు ఠాణా ఆవరణలోనే ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'చలో ఇందిరాపార్క్' కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంగూరి రాజు, రచ్చ సత్యనారాయణ, గోలకొండ ప్రభాకర్, సీత మణికంఠ, నీతి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన రాక్‌టౌన్ కాలనీ ప్రతినిధులు

- మౌలిక వసతుల కల్పనపై వినతి
- సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

**తొలివెలుగు, ఎల్బీనగర్:** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు జి. కిషన్‌రెడ్డిని రాక్‌టౌన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, బీజేపీ జీఎస్‌ఐ డివిజన్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రాక్‌టౌన్ కాలనీకి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రతినిధులు తెలిపారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. కేంద్ర మంత్రిని కలుసుకుని కాలనీ సమస్యలను వివరించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాక్‌టౌన్ కాలనీ అసోసియేషన్, బీజేపీ జీఎస్‌ఐ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, సెక్రటరీ నాగవెల్లి జైపాల్‌రెడ్డి, కాలనీ సభ్యుడు గంగాపురం ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు

- ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం
- ఎల్బీనగర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**తొలివెలుగు, ఎల్బీనగర్ :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ఆదేశాల మేరకు ఎల్బీనగర్ నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఉరిపక్క రవికుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. అనంతరం తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నాయకుడిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. తాతా మధు వెంటనే స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత స్పీకర్‌ను అవమానించినా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు ఆ పార్టీ నేతలు మౌనం వహించడం వారి దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. తాతా మధుపై వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, సుజాత నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పృథ్వీ చౌదరి, నాయకులు పాశం అశోక్‌గౌడ్, బుడ్డా సత్యనారాయణ, గణేష్ నాయక్, కందికంటి శ్రీధర్‌గౌడ్, కొండోజు శ్రీనివాస్, కడారి బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రమేశ్ మెడికల్స్‌కు 'కళారత్న' పురస్కారం

- 50 ఏళ్ల విశిష్ట ఫార్మసీ సేవలకు గుర్తింపు
- రాపోలు రమేశ్‌కు అవార్డు ప్రదానం




**తొలివెలుగు, రామన్నపేట :** ఫార్మసీ రంగంలో అర్ధ శతాబ్ద కాలంగా విశ్వసనీయ సేవలు అందిస్తున్న రామన్నపేటలోని 'రమేశ్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్' నిర్వాహకులు రాపోలు రమేశ్‌కు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 'కళారత్న-2026' పురస్కారం లభించింది. హన్మకొండలోని ఎస్‌వీఎస్ క్యాంపస్ ఆడిటోరియంలో నేతన్న టీవీ, స్వరాజ్ న్యూస్ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పద్మశాలి ప్రముఖుల సత్కార కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. 'బెస్ట్ ఫార్మసిస్ట్' విభాగంలో ఎంపికైన రమేశ్‌కు నేతన్న టీవీ సీఈఓ పులిపాటి రాజేందర్ చేతుల మీదుగా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. 50 ఏళ్ల సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం పట్ల స్థానికులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# పంట నమోదుతోనే బోనస్, మద్దతు ధర

- డిజిటల్ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి
- ఏఈవో ఎం. అశోక్‌కుమార్ సూచన

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల రైతులు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ పంట నమోదు (డిజిటల్ సర్వే) ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) ఎం. అశోక్‌కుమార్ కోరారు. పంట నమోదు సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నంబర్ల వారీగా పంట వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా సన్న రకం వరి సాగు చేసిన రైతులు రకం, విస్తీర్ణం వివరాలను సరిగ్గా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ వివరాల ఆధారంగానే క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం అందించే బోనస్‌తో పాటు మద్దతు ధరకు పంట కొనుగోలు ప్రక్రియ చేపడుతుందని చెప్పారు. సిబ్బంది పొలాల వద్దకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే రైతు వేదికల్లో సంప్రదించాలని, ఈనెల 30వ తేదీ లోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.





## ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

- ఎంపీడీవో కార్యాలయంలో బీఆర్ఎస్ వినతిపత్రం
- హామీలు నెరవేర్చాలి: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**తొలివెలుగు, రామన్నపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం రామన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నేతృత్వంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్భాటంగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. గ్యారెంటీల అమలును డిమాండ్ చేస్తూ రాజ్యాంగబద్ధంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మహిళా నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో నిరసన వ్యక్తం చేస్తే తప్పు కానప్పుడు, బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే ఎలా తప్పవుతుందని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

- బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక వైఖరి
- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**తొలివెలుగు, హైదరాబాద్/రామన్నపేట:** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని, స్పీకర్ స్థానాన్ని అవమానించడం దళిత సమాజాన్ని గాయపరచడమేనని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనూ అవమానించిన బీఆర్ఎస్ నేతలు, ప్రస్తుతం గౌరవ స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జగదీశ్‌రెడ్డి, తాతా మధు వంటి నేతల వ్యాఖ్యలు బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని తెలియజేస్తున్నాయన్నారు. స్పీకర్‌పై దుర్భాషలాడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా, సభను అడ్డుకుంటూ ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై శాసనసభలో చర్చను భరించలేకనే బీఆర్ఎస్ ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని వేముల వీరేశం స్పష్టం చేశారు.

## సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు సభ్యుడిగా డాక్టర్ రాజీరెడ్డి

- కేంద్ర సాంస్కృతిక శాఖ ఉత్తర్వులు జారీ
- సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తా: డాక్టర్ రాజీరెడ్డి



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం సోమారానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజికవేత్త డాక్టర్ రాజీరెడ్డి శీలం సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సాలార్‌జంగ్ మ్యూజియం చట్టంలోని సెక్షన్ 5(1)(జి) కింద కేంద్ర ప్రభుత్వం ఈ నియామకాన్ని చేపట్టింది. డాక్టర్ రాజీరెడ్డితో పాటు ప్రొఫెసర్ వి. కిషన్‌రావు, డాక్టర్ శ్రీపెరంబుదూర్ జైకిషన్‌లను కూడా మ్యూజియం బోర్డు సభ్యులుగా నామినేట్ చేసింది. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు కొనసాగనుంది. నియామకం సందర్భంగా డాక్టర్ రాజీరెడ్డి మాట్లాడుతూ.. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మ్యూజియం కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మ్యూజియం డైరెక్టర్, బోర్డు కార్యదర్శి ప్రియాంక మేరీ ఫ్రాన్సిస్ (ఐఏఎస్) డాక్టర్ రాజీరెడ్డికి స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఆయన మార్గదర్శకత్వం, అనుభవంతో మ్యూజియం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజాపేట మండలానికి చెందిన వ్యక్తికి కేంద్ర స్థాయిలోని ప్రతిష్ఠాత్మక సంస్థ బోర్డులో సభ్యుడిగా అవకాశం లభించడంపై స్థానికులు, విద్యావేత్తలు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ రాజీరెడ్డికి అభినందనలు తెలిపారు.

# 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

- ఉద్యోగుల హక్కుల సాధన సభ పోస్టర్ల ఆవిష్కరణ
- పోరాటాల్లో ఐక్యత చాటాలని టీజీజేఏసీ పిలుపు



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం టీజీజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్ – హక్కుల సాధన సభ'ను జయప్రదం చేయాలని నాయకులు ధరణికోట భగత్ పిలుపునిచ్చారు. సోమవారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన ప్రచార గోడపత్రికను విడుదల చేశారు.ఎఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2వ పీఆర్‌సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ, క్యాష్‌లెస్ ఈహెచ్‌ఎస్ అమలు, జీవో 317 బాధితుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. జీవో 190 అమలు, ఖాళీ పోస్టుల భర్తీ, ప్రమోషన్లు, బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరారు. ఉద్యోగులు కోరేవి కానుకలు కావు.. తాము అందించిన శ్రమకు రావాల్సిన హక్కులని స్పష్టం చేశారు. మండల పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవో రాములు నాయక్, డీటీ సఫియుద్దీన్, టీజీజేఏసీ కో–చైర్మన్ పెండ్యాం శ్రీనివాస్, నాయకులు ఖదీర్, బాలరాజు గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నల్గొండకు జాతీయ స్థాయి మకుటం

- జాతీయ స్వచ్ఛ వాయు పురస్కారం కైవసం
- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2026లో కేటగిరీ-3లో దేశంలో రెండో ర్యాంక్
- రూ.20 లక్షల నగదు బహుమతి.. డిల్లీలో అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్



**తొలివెలుగు, నల్లగొండ:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు జాతీయ స్థాయిలో మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్ సీ ఏ పీ)లో భాగంగా చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్–2026లో నల్లగొండ సత్తా చాటింది. కేటగిరీ–3లో దేశవ్యాప్తంగా 130 పట్టణ స్థానిక సంస్థలు పోటీ పడగా, నల్లగొండ కార్పొరేషన్‌లోని 16వ డివిజన్ జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన 'స్వచ్ఛ వాయు దివస్–2026' కార్యక్రమంలో రూ. 20 లక్షల నగదు బహుమతితో కూడిన పురస్కారాన్ని నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ బి.వంశీకృష్ణ, 16వ డివిజన్ కార్పొరేటర్ పెరిక స్వాతి స్వీకరించారు.

**గాలి నాణ్యత మెరుగుదలకు చర్యలు:**

నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు చేపట్టిన పలు చర్యలకు ఈ పురస్కారం దక్కింది. ముఖ్యంగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, జంక్షన్ల అభివృద్ధి, బ్లాక్ ప్లాంటేషన్, ఆధునిక ఎంఆర్ఎఫ్ ప్లాంట్ నిర్వహణ తదితర కార్యక్రమాలు అవార్డు సాధనలో కీలకంగా నిలిచాయి.

**రాష్ట్రంలో నంబర్-1గా తీర్చిదిద్దుతాం:**

నల్లగొండ కార్పొరేషన్‌ను పర్యావరణహిత నగరంగా అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్రంలోనే నంబర్–1 కార్పొరేషన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నగరాభివృద్ధికి మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నల్లగొండకు ఈ గుర్తింపు రావడం నగర ప్రజలకు గర్వకారణమని అన్నారు.



## రావినారాయణరెడ్డి పోరాటాలు అజరామరం

- ఘనంగా 37వ వర్ధంతి వేడుకలు
- గంధమల్ల రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలి

**తొలివెలుగు, రాజాపేట :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి 37వ వర్ధంతిని సోమవారం రాజాపేట మండల కేంద్రంలో మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, సీపీఐ జిల్లా నాయకుడు చిగుళ్ల లింగం మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ నిర్మూలనతో పాటు 'దున్నేవానికే భూమి' నినాదంతో భూస్వామ్య విధానాలపై పోరాడిన మహనీయుడు రావినారాయణరెడ్డి అని కొనియాడారు. ప్రజల్లో అన్యాయాలను ప్రశ్నించే చైతన్యాన్ని ఎర్రజెండా నింపిందన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పనులను వేగవంతం చేసి ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందించాలని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంధమల్ల రాజయ్య, పోయే బాబు, దయ్యాల సిద్ధులు, రేగు కార్యకిష్టయ్య, రేగు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ పేరిట రికార్డులు మార్చాలి

- ప్రజావాణిలో అధికారులకు హిందూ సేవా సమితి వినతి
- కల్యాణ మండపం భూమి రికార్డుల సవరణకు విజ్ఞప్తి



**తొలివెలుగు, చిట్యాల :** చిట్యాల–భువనగిరి రహదారిలోని సర్వే నంబర్ 649లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కల్యాణ మండపం నిర్మాణం కోసం కేటాయించిన భూమిని టీటీడీ ట్రస్ట్ బోర్డు పేరిట రికార్డుల్లో మార్చాలని హిందూ సేవా సమితి నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ అధికారులకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. భక్తుల విరాళాలతో 2002లో కొనుగోలు చేసిన ఒక ఎకరం 12 గుంటల భూమి రికార్డులను హిందువుల మనోభావాలకు అనుగుణంగా దేవాలయాల పేరిటే నమోదు చేయాలని కలెక్టర్, తహసీల్దార్లను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందూ సేవా సమితి నాయకులు కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఏళ్ల అనంతరెడ్డి, మెండే వెంకన్న, సకినాల సుధాకర్, మాస శ్రీనివాస్, కూరెళ్ళ శ్రీనివాస్, జయ్యారపు రామకృష్ణ, గంజి గోవర్ధన్, సాగర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి

- దివిస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ మురళికి ఉపాధ్యాయుల వినతి
- సీఎస్ఆర్ నిధులతో బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి
- విద్యా వాలంటీర్ల వేతనాలకూ సహకరించాలని కోరిన ఉపాధ్యాయులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం దివిస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ మురళికి పాఠశాల ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో అధిక శాతం మంది పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులే చదువుతున్నారని తెలిపారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల ద్వారా పాఠశాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి రవాణా సదు–పాయం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అలాగే విద్యార్థులకు అదనపు బోధన అందిస్తున్న విద్యా వాలంటీర్లకు గౌరవ వేతనాలు అందించేలా సంస్థ తరఫున ఆర్థిక సహకారం అందించాలని ఉపాధ్యాయులు కోరారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి దివిస్ ల్యాబొరేటరీస్ వంటి సంస్థలు సీఎస్ఆర్ ద్వారా చేయూతనందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దివిస్ ప్రతినిధి గోపి, ప్రధానోపాధ్యాయులు కోమటిరెడ్డి మాధవరెడ్డి, ఉపాధ్యాయులు అరుణ, పురుషోత్తమాచారి, విజయలక్ష్మి, రమేష్‌రెడ్డి, బండి అనిల్‌కుమార్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.





## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- చౌటుప్పల్ ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి
- 420 హామీలు, 6 గ్యారంటీలు నెరవేర్చలేదని ఆరోపణ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల, మున్సిపల్ పరిధికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా నయవంచనకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుర్కాటి నిరంజన్‌గౌడ్, మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండూరి పరమేష్, ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు గడ్డం ఇందిరా రాజారత్నం, ఊదరి యాదయ్య, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఊడుగు మల్లేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సూర్వి మల్లేష్‌గౌడ్, నాయకులు డిల్లీ మాధవరెడ్డి, అత్తార్ పాషా, చెవగోని మహేష్‌గౌడ్, ఎండీ మున్నా, మెట్టు మహేశ్వర్‌రెడ్డి, బొమ్మగోని మల్లేష్‌గౌడ్, సంగిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ నందూస్ వరల్డ్ నందన అరెస్ట్

**తొలివెలుగు, హైదరాబాద్:** జాగర్లమూడి మధుకర్, నందన (అన్నే రామ నందన) అనే భార్యాభర్తలు నందూస్ వరల్డ్ పేరుతో యూట్యూబ్ (శీబ్‌బవెవ) చానెల్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. లండన్‌లో నివసిస్తున్న తెలుగు రాష్ట్రానికి చెందిన వీరు రోజువారీ జీవిత విశేషాలు, ఫంక్షన్స్, ఇంటి పనులు, షాపింగ్, వంటలు, ట్రావెల్ వంటి వాటికి సంబంధించిన వీడియోలను షేర్ చేస్తుంటారు. వీటితో వీరు వీక్షకులకు సుపరిచితులయ్యారు. లండన్‌లో (ఖఖ) ఉద్యోగాలు, వీసా ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారు. సుమారు వంద మంది నుంచి రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితులు ఆంధ్రప్రదేశ్ (ఞా)లోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నందన, ఆమె భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వీరిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఆమె భారత్‌కు వచ్చిందని తెలుసుకున్న పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నందనను అదుపులోకి తీసుకున్నారు. నందన జనవరిలో విడుదలైన చిరంజీవి హిట్ సినిమా మన శంకర్ వరప్రసాద్ సినిమాలో నటించింది.

## రేపు తెలంగాణలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కాలేజీల ఆందోళన**
**మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం**
**వేల కోట్ల బకాయిలతో జీతాలు చెల్లించలేకపోతున్నామని యాజమాన్యాల ఆవేదన**
**ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరిక**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజమాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పలుదఫాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాజా బంద్‌తో తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తున్నట్లు వెల్లడించాయి.



# నెల్లూరు నుంచి నేరుగా తిరుమల వెళ్లిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

**నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యూపీ సీఎం యోగి**
**వెంకయ్య నాయుడు ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధి అని ప్రశంస**
**స్వర్ణ భారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవలను కొనియాడిన యోగి ఆదిత్యనాథ్**
**గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ట్రస్ట్ నెలకొల్పామన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**
**తన పిల్లలను రాజకీయాలకు దూరం పెట్టానని, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరిన వెంకయ్య**





ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

### స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం: యోగి

అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన 'స్వర్ణ భారత్–సేవా హారతి' రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.

### గ్రామీణాభివృద్ధే మా లక్ష్యం: వెంకయ్య నాయుడు

ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. తన కుమార్తె దీపా వెంకట్‌కు ట్రస్ట్ బాధ్యతలు అప్పగించానని, కుమారుడు హర్షవర్ధన్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నారని వివరించారు. తన పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని, అయితే వారి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ వేడుకల్లో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





# మదనపల్లె లేడీ డాన్.. ఎవరీ కోనేటి సులోచన?

**మదనపల్లెలో కలకలం రేపుతున్న 'లేడీ డాన్' కోనేటి సులోచన**
**ఆమె నివాసం, సోదరుడి ఇంటిపై పోలీసుల ఆకస్మిక దాడులు**
**భూ కబ్జాలు, ఫోర్జరీ పత్రాల ఆరోపణలతో 14 కేసులు నమోదు**
**రూ. 60 కోట్ల విలువైన ఆస్తులు, భారీగా డాక్యుమెంట్లు స్వాధీనం**
**విజయవాడలో ఉన్నట్లు చెబుతున్న సులోచన కోసం గాలింపు**



ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో 'లేడీ డాన్'గా పేరుపొందిన కోనేటి సులోచన నివాసంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోట్ల రూపాయల విలువైన భూదందాలు, బెదిరింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలతో పోలీసులు ఆమె ఇల్లు, ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంటిపై ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల సమయంలో సులోచన ఇంట్లో లేరని, ఆమె విజయవాడలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డెక్కన్ క్రానికల్ ప్రచురించిన ఒక కథనం ఈ వివరాలను వెల్లడించింది. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు నేతృత్వంలో మూడు పోలీసు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. మార్పు వెంకటేశ్ నాయుడు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు, కోర్టు నుంచి పొందిన వారెంట్ ఆధారంగా ఈ దాడులు నిర్వహించారు. సులోచన ఇంటి నుంచి సుమారు 50 కీలక డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని భావిస్తున్న 15 బాండ్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఇవ్వకుండా ఈ దాడులను ఆకస్మికంగా నిర్వహించినట్లు పోలీసులు వివరించారు. స్వాధీనం చేసుకున్న పత్రాలను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. ఒకప్పుడు వ్యవసాయ కూలీగా ఒకే గది ఇంట్లో నివసించిన సులోచన, అనతికాలంలోనే కోట్లకు పడగెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల అండదండలతో ఆమె అక్రమాలకు పాల్పడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో భారీ ల్యాండ్ మాఫియా నడుపుతున్నట్లు ఆమెపై ప్రధాన ఆరోపణ. అవసరమైన వారికి అప్పులు ఇచ్చి, ఆ తర్వాత బెదిరింపులు, దౌర్జన్యాలతో వారి భూములను అన్యాయంగా రాయించుకుంటోందని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆమె ఇంటి వద్ద బౌన్సర్లను కాపలాగా ఉంచి, బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెబుతున్నారు. పోలీసు రికార్డుల ప్రకారం, సులోచనపై ఇప్పటికే మదనపల్లె వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్లలో కలిపి 14 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై రౌడీ షీట్ కూడా తెరిచారు. పోలీసుల దాడుల తర్వాత మరింత మంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నట్లు సమాచారం. బండిమీదకమ్మలపల్లెలో ఒక భవనం, 502 గజాల స్థలం (వీటి విలువ సుమారు రూ.60 కోట్లు), పొన్నుటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఆమె పేరు మీద ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో 'లేడీ డాన్‌లు'గా పేరుపొందిన నిడిగుంట అరుణ, అరవ కామాక్షి తరహాలోనే సులోచన కూడా నేర సామ్రాజ్యాన్ని విస్తరించిందని స్థానికులు పోల్చుతున్నారు. కాగా, ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత ఫోర్జరీ ఆరోపణలపై మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.



# ప్రతిఘటించేవారంతా దిమాగీ నక్సల్సేనా?

బీజేపీ ఏలుబడిలో సాయుధ నక్సల్స్‌ను అంతమొందించినా ఇంకా దేశంలో మేధో నక్సల్స్ పొంచి ఉన్నారంటూ ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరిస్తున్నారు. ఎనభయ్యో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ ఇలాంటి మేధావులను 'దిమాగీ నక్సల్స్' అని మోదీ వర్ణించడం వింతగా లేదు. కాషాయ సిద్ధాంతాలు, బీజేపీ పోకడలను వ్యతిరేకించే రాజకీయ ప్రత్యర్థులు, ఆలోచనాపరులను ఆయన గతంలో 'అర్బన్ నక్సల్స్' అని దూషించారు. ఇంకా ఆ పని చేస్తూనే ఉన్నారు. కొన్ని దశాబ్దాలుగా అడవుల నుంచి పోరు సాగిస్తూ ఇటీవల దాదాపు అంతరించిన సాయుధ నక్సల్స్ గురించి మనకు తెలుసు. పౌర సమాజంలో నివసిస్తూ సర్కార్ విధానాలను విమర్శించేవారు, ప్రతిఘటించే కార్యకర్తలు, నేతలను 'అర్బన్ నక్సల్స్' అంటూ నిందించడం బీజేపీ నేతలకు అలవాటుగా మారింది. అసలు 'అర్బన్ నక్సల్' అంటే ఏంటని పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి అమిత్ షాను గతంలో ప్రశ్నించగా, ఈ పదానికి ఎలాంటి చట్టపరమైన నిర్వచనం లేదని జవాబిచ్చారు. కేంద్ర హోం శాఖ కూడా 'అర్బన్ నక్సల్' అనే మాటలను వాడదని ఆరేండ్ల క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి తృణమూల్ సభ్యుడొకరు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వామపక్ష భావజాలం ఉన్నవారిని లేదా పన్నెండేండ్లుగా కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తున్న వారందరినీ 'అర్బన్ నక్సల్స్' అని దూషించడం బీజేపీ నేతలు, ఆ పార్టీ కార్యకర్తలకు ఆనవాయితీగా మారింది. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్‌లో యువకులు, విద్యార్థుల ఆందోళనతో మోదీ సర్కార్ వారి డిమాండ్లకు తలొగ్గక తప్పలేదు. ఈ షాక్ నుంచి ఇంకా కోలుకోని ప్రధాని తన ప్రభుత్వాన్ని విమర్శించే వారిని దూషించడానికి, వేధించడానికి ఇప్పుడు 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త మాటను కనిపెట్టారు. 196974 మధ్యకాలంలో నాటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ తానో గొప్ప ప్రగతిశీల పాలకురాలిగా మాట్లాడేవారు. తన సర్కార్ పోకడలను విమర్శించే వారిని అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలురుగా, దాని గూఢచార సంస్థ సీఐఏకు తొత్తులుగా అభివర్ణించేవారు. ప్రతిపక్ష నేతలను ఇలా దూషించడం నాటి కాంగ్రెస్ నేతలకు కొట్టినపిండి. దాంతో అప్పటి స్వతంత్ర పార్టీ నేత, ప్రఖ్యాత పార్లమెంటేరియన్ పిలూ మోదీ 1970 ఆరంభంలో ఒకరోజు 'నేను సీఐఏ ఏజెంటు'ను అని రాసిన అట్టను తన కట్టుకుని పార్లమెంటులో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం మోదీ ప్రసంగం విన్నాక తానూ 'దిమాగీ నక్సల్'నేనని ప్రకటించారు. యూపీఏ పాలనలో కేంద్ర హోంమంత్రిగా దేశవ్యాప్తంగా నక్సలైట్ల ఏరివేతకు, వారి సానుభూతిపరులను వేధించడానికి చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) తీసుకురావడంలో చిదంబరంది కీలక పాత్ర. దేశానికి అత్యంత తీవ్ర ముప్పు వామపక్ష తీవ్రవాదం నుంచే ఎదురవుతున్నదని ప్రకటించిన యూపీఏ ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో ఆయన అత్యంత కీలక పాత్ర పోషించారు. మోదీ మాటలను ఎగతాళి చేస్తూ జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీ కూడా తాను కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని నిలబెట్టే 370వ అధికరణకు అనుకూలం కాబట్టి తాను కూడా 'దిమాగీ నక్సల్'నేనని ప్రకటించడం విశేషం. చివరికి బిహార్ ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కొడుకు తేజ్‌ప్రతాప్ యాదవ్ కూడా ఈ విషయంలో ప్రధానిని ఎద్దేవా చేస్తూ కొన్ని ప్రశ్నలు అడిగాడు. 'ఎవరు మేధో నక్సలైటో, ఎవరు కాదో తేల్చి చెప్పడానికి మోదీ అత్యంత మెరుగైన స్థితిలో ఉన్నారు. మోదీ దేశవ్యాప్తంగా పర్యటించి 'దిమాగీ నక్సల్స్'ను గుర్తించి పట్టుకోవాలి. అసలు 'దిమాగీ నక్సల్స్' పెద్ద సంఖ్యలో ఆయన పార్టీ బీజేపీలోనే కనిపిస్తారు' అని తేజ్ ప్రతాప్ చమత్కరించారు. 'దిమాగ్' అంటే హిందీలో మెదడు అనే విషయం తెలిసిందే. మెదడుతో ఆలోచిస్తూ పాలకుల అప్రజాస్వామిక, అవినీతితో కూడిన విధానాలను ఎండగడితే అలాంటి నాయకులు, మేధావులు, కార్యకర్తలు, సామాన్య పౌరులందరినీ 'దిమాగీ నక్సల్' అనే ముద్రతో వారిని సమాజం నుంచి వేరుచేయాలని సాక్షాత్తూ ప్రధాని కోరడం అవాంఛనీయమేగాక ప్రమాదకరం. నక్సలిజం వల్ల గతంలో ఎంతోమంది యువకుల భవిష్యత్తు దెబ్బతిన్నదని చెప్పిన ప్రధాని ఇప్పుడు యువత 'వికసిత భారతం' వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అమెరికాలో స్థిరపడిన భారతీయుడు, వెబ్ ఆధారిత ఉచిత మెయిల్ సేవల సంస్థ హాట్‌మెయిల్ స్థాపకుడు సబీర్ భాటియా ప్రధాని మాటకు స్పందిస్తూ, 'దిమాగీ నక్సల్స్' అంటే 'బుద్ధిజీవులు' అనే అర్థంలో 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. 1970, ముఖ్యంగా 1980 ఆరంభంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ కూడా తన సర్కార్ విధానాలను తప్పుపడుతూ మాట్లాడేవారిని దేశద్రోహులుగా, విదేశీ శక్తుల తొత్తులుగా దూషించిన సంగతి పాతతరం పౌరులకు ఇంకా గుర్తుంది. ఆమె తరచూ ఉచ్చరించిన 'విదేశీ హస్తం' ఇంకా జనం మనసుల నుంచి అదృశ్యం కాలేదు. తనను విమర్శించే ప్రతిపక్ష నేతలు, మేధావులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులపై ఆమె విరుచుకుపడేవారు. ఇలాంటివారి నుంచి దేశ సమగ్రతకు, ఐక్యతకు ప్రమాదం పొంచి ఉన్నదని ఆమె నిప్పులు చెరిగేవారు. నియంతృత్వ, ఆధిపత్య, పెత్తందారీ ధోరణుల్లో మోదీకి ఆదర్శం ఇందిరమ్మేనని 2014 నుంచీ బీజేపీ ఏలుబడి చూస్తున్న పౌరులకు అర్థమౌతున్నది. ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్స్' అంటూ ప్రధాని మోదీ చేసిన హెచ్చరిక కూడా ప్రజల్లో బీజేపీ పాలకులను పలుచన చేయడానికి మాత్రమే ఉపకరిస్తుంది.




**తొలివెలుగు, చౌటుప్పల్ :**

వాణిజ్య అవసరాల కోసం రైస్ మిల్లు నుంచి చౌటుప్పల్‌లోని ఓ రైస్ డిపోకు సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బిల్లులో వస్తు సేవల పన్ను చూపించకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఎస్‌ఎన్ 1006 కింద 25 కిలోల ప్యాకేజీల్లో, వివిధ బ్రాండ్ల పేర్లతో సరఫరా చేసిన 31.20 క్వింటాళ్ల బియ్యానికి కిలో రూ.50 చొప్పున రూ.1,56,000గా బిల్లు రూపొందించినట్లు సమాచారం. అయితే బిల్లులో కేంద్ర వస్తు సేవల పన్ను, రాష్ట్ర వస్తు సేవల పన్ను వివరాలు లేకపోవడం చర్చకు దారితీసింది. వస్తు సేవల పన్ను నిబంధనల ప్రకారం బియ్యం వంటి ధాన్యాలపై ప్యాకేజింగ్, లేబులింగ్, సరఫరా స్వరూపాన్ని బట్టి పన్ను వర్తించే పరిస్థితులు ఉండొచ్చన్న నేపథ్యంలో.. ఈ లావాదేవీకి పన్ను మినహాయింపు ఏ నిబంధన కింద వర్తింపజేశారన్నది స్పష్టత కావాల్సిన అంశంగా మారింది.

### రూ.7,800 పన్ను రావాల్సి ఉందా?

రూ.1,56,000 మొత్తాన్ని పన్ను విధించదగిన విలువగా పరిగణించి 5 శాతం పన్ను లెక్కిస్తే రూ.7,800 పన్ను వస్తుందని చర్చ జరుగుతోంది. తెలంగాణలోనే సరఫరా జరిగినట్లయితే కేంద్ర వస్తు సేవల పన్ను 2.5 శాతం, రాష్ట్ర వస్తు సేవల పన్ను 2.5 శాతం చొప్పున రూ.3,900 ం రూ.3,900గా ఉండే అవకాశం ఉంటుంది.

అయితే బిల్లులో పేర్కొన్న రూ.1.56 లక్షలు పన్నుకు ముందున్న విలువా? లేక పన్నుతో కలిపిన మొత్తం విలువా? అన్నది కూడా నిర్ధారించాల్సి ఉంది. కేవలం బిల్లును పరిశీలించడం ద్వారా తుది పన్ను బాధ్యతను నిర్ధారించలేమని, సరఫరా స్వరూపం, ప్యాకేజింగ్, లేబులింగ్ తదితర అంశాలను కూడా పరిశీలించాల్సి ఉ ంటుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

### ప్యాకేజింగ్, లేబులింగ్‌పై పరిశీలన అవసరం:

సరఫరా చేసిన బియ్యం 25 కిలోల ప్యాకేజీల్లో ఉందని, వివిధ బ్రాండ్ల పేర్లతో బ్యాగులు ఉన్నట్లు పేర్కొంటున్న నేపథ్యంలో.. అవి నిబంధనల ప్రకారం ముందస్తుగా ప్యాక్ చేసి, లేబుల్ చేసిన సరుకుల కేటగిరీలోకి వస్తాయా? లేదా సంబంధిత పన్ను మినహాయింపు నిబంధన ఏదైనా వర్తిస్తుందా? అనేది పరిశీలించాల్సిన అంశం. అదేవిధంగా బియ్యం ఏ రూపంలో ప్యాక్ చేశారు, సంచులపై ఏ వివరాలు ఉన్నాయి, సరఫరా ఎవరికి, ఏ ఉద్దేశంతో జరిగింది, బిల్లులో పన్ను మినహాయింపును ఏ నిబంధన ఆధారంగా చూపించారు తదితర అంశాలపై అధికారులు పరిశీలన చేయాల్సి ఉంది.

### 'జీరో బిల్లు' వ్యాపారంపై అనుమానాలు:

చౌటుప్పల్‌లో వాణిజ్య బియ్యం విక్రయాల్లో పన్ను చూపించకుండా 'జీరో బిల్లులు' జారీ చేస్తున్న వ్యాపారం జరుగుతోందన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇవి ప్రస్తుతం అనుమానాలు, ఆరోపణల స్థాయిలోనే ఉన్నందున సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనల ప్రకారం పన్ను మినహాయింపు వర్తిస్తే అందుకు సంబంధించిన కారణాలను స్పష్టం చేయాలని, పన్ను వర్తించే లావాదేవీ అయితే బిల్లులో పన్ను ఎందుకు చూపలేదో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. చౌటుప్పల్‌లో ఇలాంటి లావాదేవీలు మరిన్ని జరుగుతున్నాయా అనే కోణంలోనూ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ బిల్లుతో పాటు సంబంధిత ప్యాకేజింగ్, లేబులింగ్, కొనుగోలు-విక్రయ రికార్డులు, వస్తు సేవల పన్ను రిటర్నులు, సరఫరా వివరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పన్ను మినహాయింపు వర్తించిందా? లేక పన్ను చెల్లించాల్సి ఉందా? అన్న విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

# 'వలస భూతం' ఎవరి సృష్టి?



యూరప్‌ను వలస భూతం ఇంకా వెన్నాడుతూనే ఉంది. ఆ బెడద గురించి అత్యవసరంగా చర్చించేందుకు యూరోపియన్ యూనియన్(ఈయూ) మంగళవారం సమావేశం కాబోతోంది. గతవారం స్పెయిన్ అధీనంలోని స్యూటా నగరానికి ఒక్కసారిగా పొరుగునున్న మొరాకో నుంచి శరణార్థులు వెల్లువెత్తడంతో ఆ దేశం దిక్కుతోచని స్థితికి చేరింది. 60,000 మంది వచ్చిపడితే అదుపు చేయటమెలాగో స్పెయిన్‌కు అర్థం కాలేదు. స్పెయిన్ దళాల కాల్పుల్లో 72 మంది శరణార్థులు మరణించారు. ప్రస్తుతానికి ఇది ఉపశమించిందని స్పెయిన్ చెబుతున్నా స్వదేశంలోని మితవాదపక్షంతోపాటు ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి చెందిన అతి మితవాద పక్షం స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌ను తప్పుబడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం స్పెయిన్‌ని నిందిస్తున్నారు.

వలసలపై ఆఫ్రికా ఖండ దేశాలను తప్పుబట్టి ప్రయోజనం లేదు. అక్కడి ఆర్థిక వ్యవస్థలు అంతంతమాత్రం కావటం వాస్తవం. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవటమూ నిజమే. శతాబ్దాల తరబడి అక్కడి సంపదనంతా కొల్లగొట్టిన యూరప్ దేశాలే ఈ దుఃస్థితికి కారణం. అందుకు సిగ్గుపడకపోగా... తాము కష్టపడి సంపద పోగేస్తుంటే ఈ వలసలు తలనొప్పిగా మారాయని వాపోతున్నాయి. కానీ శరణార్థులవి పొట్టకూటి తిప్పలు మాత్రమే. వారు యూరప్ దేశాల్ని దోచుకుతినడానికి రావడంలేదు. నిరుడంతా జెన్ జీ ఉ ద్యమం మొరాకోను ఊపిరాడనీయకుండా చేసింది. అక్కడ నిరుద్యోగం మాత్రమే సమస్య కాదు. రెక్కలు ముక్కలు చేసుకుంటున్నవారికి సైతం 12 గంటలు శ్రమించినా దక్కేది స్వల్పం. పెరుగుతున్న ధరలకూ, వచ్చే వేతనానికీ మధ్య అగాథాన్ని పూడ్చలేక అర్ధాకలితో బతకడం అక్కడివారికి నిత్య నరకం. అసలు ఆఫ్రికా ఖండంలోని స్యూటా, మెలిల్లా నగరాలతో మధ్యధరా సముద్రం ఆవలనున్న స్పెయిన్‌కు ఏం సంబంధం? అవి భౌగోళికంగా మొరాకోకు చేర్చివుంటాయి. స్పెయిన్ భూభాగంనుంచి జిబ్రాల్టర్ జలసంధి గుండా వెళ్తే స్యూటా 14 కిలోమీటర్ల దూరం. మెలిల్లా నగరమైతే ఏకంగా 150 కిలోమీటర్ల ఆవల ఉంటుంది. ఎప్పుడో 1497లో మెలిల్లానూ, 1668లో స్యూటానూ స్పెయిన్ ఆక్రమించుకుంది. 1956లో మొరాకో స్వాతంత్ర్యం పొందినప్పుడు న్యాయంగా అయితే ఆ రెండింటినీ స్పెయిన్ అప్పగించితీరాలి. కానీ ఆధునిక మొరాకో ఏర్పడటానికి వందల సంవత్సరాలక్రితం తమ చేతికొచ్చాయి గనుక, దీన్ని ఆక్రమణగా చూడొద్దని స్పెయిన్ తర్కానికి దిగింది. ఐక్యరాజ్యసమితి 2014లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) కనబడకుండాపోయిన శరణార్థుల డేటా సేకరిస్తోంది. మధ్యధరా సముద్రం దాటూతూ ఇంతవరకూ 33,220 మంది అదృశ్యమయ్యారని ఆ డేటా చెబుతోంది. కానీ ఇది సమగ్రం కాదని ఆ సంస్థే అంటోంది. వాస్తవానికి మధ్యధరా సముద్ర దక్షిణ తీరానికి చేరేముందు అత్యంత కంటకప్రాయమైన సహారా ఎడారిలోనే అనేకులు తనువులు చాలిస్తారు. సముద్రాన్ని దాటే క్రమంలో సంభవించే మరణాలతో పోలిస్తే ఆ సంఖ్య చాలా ఎక్కువని ఐఓఎం అంటున్నది. కాలినడకన మూడు రోజులు పట్టే ఆ మార్గంలో మృత్యు ఇసుక తుపాన్లు విరుచుకుపడకపోతే, స్మగ్లర్లు కాల్చిచంపకపోతే మధ్యధరా తీరానికి శరణార్థులు చేరుకోగలుగుతారు. ఆ తర్వాత సైతం రాకాసి అలలనుంచీ, సరిహద్దు దళాలనుంచీ ప్రాణగండమే. ఒక డేటా ప్రకారం 2024 నాటికి శరణార్థులు 30 కోట్ల 40 లక్షలు. వీరందరికీ ఒక దేశాన్ని సృష్టిస్తే అది భారత్, చైనా, అమెరికాల తర్వాత అతి పెద్ద జనాభాగల దేశమవుతుంది. ప్రపంచబ్యాంకు లెక్కలు తిరగేస్తే వీరు తమ కుటుంబాలకు పంపే సొమ్ము 2024 నాటికి 90,500 కోట్ల డాలర్లు! 2014లో అమెరికా, చైనా, జపాన్‌ల ఉమ్మడి విదేశీ పెట్టుబడులకన్నా అధికం. కనుక శరణార్థుల్ని శత్రువులుగా... 'దరిద్రగొట్టు' ఆఫ్రికా దేశాలవల్ల కలిగే అనర్థంగా ఈయూ పరిగణించటం మానుకోవాలి. నిత్యం మృత్యుగీతం వినిపించే ఉక్రెయిన్ యుద్ధం కోసం పారబోసే కోట్లాది డాలర్లలో కొంత శాతమైనా ఆఫ్రికా దేశాల ఆర్థిక ప్రగతికి వెచ్చించగలిగితే అవి ఊపిరిపీల్చుకోవటంతో పాటు తమ గత పాపాలు శాపాలై వెంటాడకుండా ఉంటాయని గుర్తించాలి. ఈయూ అత్యవసర సమావేశం చర్చించాల్సింది దీనిపై!



## అడోబ్ కొత్త సీఈఓ.. ఎవరీ అనిల్ చక్రవర్తి?

అడోబ్ సంస్థకు కొత్త సీఈఓగా అనిల్ చక్రవర్తి నియమితులయ్యారు. డిసెంబర్ 1 నుంచి ఆయన ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే ఇప్పటి వరకు దాదాపు 18 ఏళ్లుగా సంస్థకు నాయకత్వం వహించిన శంతను నారాయణ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌గా కొనసాగనున్నారు. అనిల్ చక్రవర్తి జనవరి 2020లో అడోబ్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, దాని డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ బిజినెస్ జనరల్ మేనేజర్‌గా చేరారు. సంవత్సరం తరువాత.. అతను కంపెనీ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో అంతటా ఎంటర్‌ప్రైజ్ కస్టమర్‌లకు సేవలు అందించే అడోబ్ యొక్క ప్రపంచవ్యాప్త ఫీల్డ్ కార్యకలాపాల బాధ్యతను కూడా స్వీకరించారు. డిసెంబర్ 2021లో, ఆయన డిజిటల్ ఎక్స్‌పీరియన్స్, ప్రపంచవ్యాప్త ఫీల్డ్ ఆపరేషన్స్ విభాగానికి అధ్యక్షుడిగా పదోన్నతి పొందారు. అడోబ్‌లో చేరడానికి ముందు, చక్రవర్తి నాలుగు సంవత్సరాల పాటు ఇన్ఫర్మాటికా సీఈఓగా పనిచేశారు. ఆయన తొలుత 2013లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఈ ఎంటర్‌ప్రైజ్ క్లౌడ్ డేటా మేనేజ్‌మెంట్ కంపెనీలో చేరారు. తన కెరీర్ ప్రారంభంలో, ఆయన సిమాంటెక్ అండ్ వెరిసైన్‌లలో ఎగ్జిక్యూటివ్ పదవులను నిర్వహించారు. మెకిన్సీ డ కంపెనీలో కూడా పనిచేశారు. దీనివల్ల ఆయనకు టెక్నాలజీ పరిశ్రమలోని వివిధ రంగాలలో అనుభవం లభించింది.చక్రవర్తి భారతదేశంలోని వారణాసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ పట్టా పొందారు. ఆయన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి మాస్టర్ ఆఫ్ సైన్స్, పిహెచ్.డి. పట్టాలను కూడా పొందారు.

## టాటా.కార్స్ నుంచి కర్వ్ 'సిరీస్ ఎక్స్'



టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన విభాగం తన 'కర్వ్' మోడల్‌లో 'సిరీస్ ఎక్స్' కార్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ శ్రేణి ప్రారంభ ధరను రూ.9.99 లక్షలు (ఎక్స్--షోరూమ్)గా నిర్ణయించింది. కూపే తరహా డిజైన్, పనితీరు, సౌకర్యం, ప్రీమియం ఫీచర్లు, భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఈ కొత్త రేంజ్‌ను తీసుకొచ్చి?చనట్లు కంపెనీ తెలిపింది. 'సిరీస్ ఎక్స్'లో ప్యూర్ ఎక్స్ రూ.10.99 లక్షల ప్రారంభ ధరతో, ప్యూర్ ఎక్స్ ప్లస్ రూ.11.79 లక్షలతో, క్రియేటివ్ ఎక్స్ ప్లస్ రూ.12.91 లక్షలతో అందుబాటులోకి వచ్చాయి. ప్యూర్ ఎక్స్ ప్లస్ ఆధారిత 'డార్క్' ఎడిషన్‌ను రూ.11.99 లక్షల ప్రారంభ ధరతో అందిస్తోంది. ప్యూర్ ఎక్స్ వేరియంట్‌లో 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, క్రూయిజ్ కంట్రోల్, పుష్ బటన్ స్టార్ట్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, టెయిల్‌ల్యాంప్‌లు వంటి ఫీచర్లు ఉన్నాయి. ప్యూర్ ఎక్స్ ప్లస్‌లో అదనంగా ప్రీమియం లెదరెట్ సీట్లు, 17 అంగుళాల డైమండ్ కట్ అల్లాయ్ వీల్స్ లభిస్తాయి. క్రియేటివ్ ఎక్స్ ప్లస్ వేరియంట్‌లో పనోరమిక్ సన్‌రూఫ్, 360 డిగ్రీల సరౌండ్ వ్యూ కెమెరా, బ్లైండ్ వ్యూ మానిటర్, 18 అంగుళాల డైమండ్ కట్ అల్లాయ్ వీల్స్, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, డిజిటల్ కాక్‌పిట్, నావిగేషన్ డిస్‌ప్లే వంటి అదనపు ఫీచర్లు ఉన్నాయి. అకెంప్లిష్డ్ ఎక్స్, అకెంప్లిబ?డ ఎక్స్ ప్లస్ టాప్--ఎండ్ మోడళ్లలో లెవెల్--2 ఏడీఏయస్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 6--వే పవర్డ్ డ్రైవర్ సీట్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, 9 స్పీకర్లు, వైర్‌లెస్ ఛార్జర్, ట్విన్--జోన్ క్లైమేట్ కంట్రోల్, ఎయిర్ ప్యూరిఫైయర్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ, అలెక్సా ఇంటిగ్రేషన్ వంటి అధునాతన ఫీచర్లు అందిస్తున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది. డార్క్ ఎడిషన్‌ను బ్లాక్--అవుట్ రూపాన్ని కోరు కునే వినియోగదారుల కోసం ప్యూర్ ఎక్స్ ప్లస్ వేరియంట్ ఆధారంగా రూ.11.99 లక్షల ప్రారంభ ధరతో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ సీసీఓ వివేక్ శ్రీవత్స మాట్లాడుతూ.. "భారతదేశంలో ఎస్‌యూవీ డిజైన్ ఆలోచనా విధానాన్ని 'కర్వ్' మార్చివేసింది. రూ.9.99 లక్షల ప్రారంభ ధరతో వస్తున్న కర్వ్ సిరీస్ ఎక్స్ మరింత మంది వినియోగదారులకు అందుబాటులోకి వస్తోంది. ఎలాంటి రాజీ లేకుండా ఆకర్షణీయమైన డిజైన్, పనితీరు, సౌకర్యం, ప్రీమియం ఫీచర్లు, భద్రతను అందించడమే దీని లక్ష్యం" అని పేర్కొన్నారు.

## బుధుడి చెంతకు 'బెపి కొలంబో'!

బుధుడు... పరిమాణంలో మన చందమామ కంటే కొంచెం పెద్ద... సౌరవ్యవస్థలో అతి చిన్న గ్రహం... సూర్యుడికి అతి దగ్గరగా ఉండే గ్రహం కూడా... దీనికి సహజ చంద్రులు లేవు. బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు... ఇవి సౌరకుటుంబంలో శిలామయ అంతర గ్రహాలు. సౌరవ్యవస్థలోని 'పాత నవగ్రహాల' మాటకొస్తే... ప్లూటో గతంలో గ్రహం హోదా కోల్పోవడంతో అధికారికంగా అష్టగ్రహాలే మిగిలాయి. వీటిలో భూమిని తప్పిస్తే మిగతా ఏడు గ్రహాల్లో శాస్త్రవేత్తలు ఇప్పటివరకు అతి తక్కువగా అధ్యయనం చేసింది బుధుడి గురించే! అలాంటి బుధుడి సంగతేంతో తేల్చడానికి, ఆ గ్రహాన్ని జల్లెడపట్టి లోతుగా అధ్యయనం చేయడానికి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ), జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా) సంయుక్తంగా 2018లో 'బెపి కొలంబో' అంతరిక్ష మిషన్ ప్రయోగించాయి. ఇందులో భాగంగా జంట వ్యోమనౌకలు (ఉపగ్రహాలు) ఈ ఏడాది నవంబరులో బుధుడి కక్ష్యలో ప్రవేశించనున్నాయి. 1920–1984 మధ్యకాలంలో జీవించిన జూసెప్పీ బెపి కొలంబో ఇటలీకి చెందిన ఓ గణిత శాస్త్రజ్ఞుడు. బుధ, శుక్ర గ్రహాల వద్దకు తొలిసారిగా 1970వ దశకంలో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రయోగించిన 'మెరైనర్–10' మిషన్లో ఆయన పాలుపంచుకున్నారు. బెపి కొలంబో సేవలను స్మరిస్తూ తాజా ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టారు. అప్పట్లో బుధ, శుక్ర గ్రహాలకు సమీపంగా వెళ్లిన 'మెరైనర్–10' అంతరిక్ష నౌక వాటి ఫొటోలు తీసి భూమికి పంపింది. ఆ తర్వాత 2004లో నాసా ప్రయోగించిన 'మెసెంజర్' వ్యోమనౌక (ఆర్బిటర్) తొలిసారిగా 2011లో బుధుడి కక్ష్యలో ప్రవేశించి 2015 వరకు ఆ గ్రహాన్ని మరింత అన్వేషించింది.

# ఎయిర్‌లైన్స్‌కు చమురు కష్టాలు..
# పెరుగుతున్న ఏటీఎఫ్ ధరలతో నష్టాల బెడద

**స్టాక్ మార్కెట్లలో కంపెనీల షేర్లు విలవిల**

న్యూఢిల్లీ: భారతీయ విమానయాన పరిశ్రమకు మళ్లీ చమురు కష్టాలు వచ్చిపడ్డాయి. అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య మరోమారు ఉద్రిక్తతలు తలెత్తడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం దేశీయ మార్కెట్‌లో విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు పెరిగాయి. లీటర్ రూ.6.28 ఎగబాకింది. ఆగస్టులోనూ ఒకసారి లీటర్ రూ.5 పెరిగిన విషయం తెలిసిందే. అయితే పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముదిరితే ధరలు ఇంకా పెరుగవచ్చున్న అంచనాలున్నాయి. ఇది ఏవియేషన్ ఇండస్ట్రీని కలవరపెడుతున్నదిప్పుడు. పెరుగుతున్న చమురు ధరలు.. ఎయిర్‌లైన్స్ నిర్వహణ ఖర్చులను ఎగదోసేలా ఉన్నాయి. సంస్థాగత నిర్వహణ వ్యయాల్లో ఏటీఎఫ్ వాటానే 35–40 శాతంగా ఉంటుంది మరి. ఈ నేపథ్యంలో అధిక చమురు ధరలు.. ఎయిర్‌లైన్స్ నష్టాలకు దారితీసే ప్రమాదం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో టికెట్ ధరలు పెరిగే అవకాశాలూ లేకపోలేదు. ఇదే జరిగితే ప్రయాణికులపై అదనపు భారం తప్పదని చెప్పవచ్చు. అయితే మార్కెట్‌లో పోటీ దృష్ట్యా కొన్ని ఎయిర్‌లైన్స్.. అధిక చమురు ధరల భారాన్ని ప్రయాణికులపై మోపకుండా భరించే యోచనలో ఉన్నట్టు కూడా తెలుస్తున్నది. దీనివల్ల ఆయా సంస్థల లాభాలు తగ్గిపోవడమో, నష్టాలు వాటిల్లడమో జరుగుతుందని.. ఇది ఇండస్ట్రీకి అంత మంచి పరిణామం కాదని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న మొదలైన మిడిల్ ఈస్ట్ యుద్ధం.. 6 నెలలు దాటినా ఆగట్లేదు. దీంతో భారత్ సహా చమురు దిగుమతులపై ఆధారపడ్డ చాలా దేశాలకు ఈ వార్ ఇబ్బందికరంగా మారింది. దేశీయ ఇంధన అవసరాలు సుమారు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న సంగతి విదితమే. ఇందులో గల్ఫ్ దేశాల నుంచి హొర్ముజ్ జలసంధి మీదుగా వస్తున్నది ఎక్కువే. ఇరాన్ హొర్ముజ్‌లో రవాణాకు ఆటంకాలు ఏర్పరుస్తుండటంతో భారత్‌కు డిమాండ్‌కు తగ్గ ముడి చమురు రాలేకపోతున్నది. ఫలితంగా దేశంలో ధరలు పెరుగుతున్నాయి. ఇక 15 రోజులకోసారి (ప్రతి నెలా 1, 15 తేదీల్లో) పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్, వంట గ్యాస్ సహా అన్ని ఇంధనాల ధరలను అంతర్జాతీయ ముడి చమురు ధరల ఆధారంగా దేశీయ చమురు మార్కెటింగ్ సంస్థలు సవరిస్తున్నది తెలిసిందే. ఇలా గడిచిన 2 నెలల్లో ఏటీఎఫ్ ధర లీటర్ రూ.11.28 పెరిగింది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ రేటు 91 డాలర్లపైనే పలుకుతున్నది. గతంలో 125 డాలర్లుగా నమోదైన సంగతి విదితమే పెరుగుతున్న ఇంధన ధరల



నేపథ్యంలో స్టాక్ మార్కెట్లలో ఎయిర్‌లైన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. గురువారం నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ)లో ఇండిగో షేర్ విలువ రూ.41 పడిపోయి రూ.4,979 వద్ద స్థిరపడింది. స్పైస్‌జెట్ షేర్ కూడా ఒడిదుడుకుల్లో కదలాడుతున్నది. ఒకవేళ పెరిగినా స్వల్ప లాభాలకే పరిమితమవుతున్నది. ఇదిలావుంటే కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలపైనా చమురు ధరల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్–జూన్‌లో ఇండిగో రూ.238 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. స్పైస్‌జెట్ సోమవారం ప్రకటించనున్నది. నిజానికి ఇప్పటికే ఆయా విమానయాన సంస్థలు అధిక ఇంధన ధరల భారాన్ని మోయలేక సతమతమవుతున్నాయి. టికెట్ ధరల పెంపుతో ప్రయాణికులపై కొంత భారం మోపినా.. పోటీ కారణంగా మిగతా భారాన్ని దిగమింగక తప్పట్లేదని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే గిరాకీ లేని రూట్లలో సేవలు నిలిపివేస్తున్నాయని, కొత్త రూట్లను ప్రకటించడం లేదని అంటున్నారు. ఇక ఉద్రిక్తతలు, యుద్ధాల కారణంగా పాకిస్థాన్, మిడిల్ ఈస్ట్, ఉక్రెయిన్–రష్యా దేశాల గగన తలాల వినియోగంపై ఆంక్షలుంటున్నాయని, దీంతో ప్రయాణ దూరం పెరుగుతున్నదని ఎయిర్‌లైన్స్ వాపోతున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయంలో లాభాల వాటా బాగా తగ్గిపోతున్నదని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. మొత్తానికి ప్రస్తుత పరిస్థితులు భారతీయ విమానయాన రంగాన్ని కుదేలు చేస్తున్నాయని చెప్పకతప్పదు. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న నేపథ్యంలో విమానయాన ఇండస్ట్రీ కోసం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద ధర స్థిరీకరణ పథకాన్ని పరిచయం చేసింది. ఈ స్కీమ్‌లో చేరిన ఎయిర్‌లైన్స్‌కు మూడేండ్లపాటు గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలతో సంబంధం లేకుండా (పెరిగినా, తగ్గినా) లీటర్ రూ.115కే దొరుకుతుంది. పథకంలో చేరని ఎయిర్‌లైన్స్ ఎప్పట్లాగే మార్కెట్ రేట్లకు కొనుగోలు చేయవచ్చు. అయితే ధరలు పెరిగితే భారం పడుతుంది. కానీ తగ్గితే లాభదాయకం. ఇటీవల అమెరికా–ఇరాన్ మధ్య చర్చల నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. అప్పుడు సదరు పథకంలో చేరని ఎయిర్‌లైన్స్‌కు తక్కువ ధరకే ఇంధనం లభించింది. కానీ ఇప్పుడు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం లీటర్ రూ.110గా ఉన్నది. గల్ఫ్ పరిస్థితులనుబట్టి ఇంకా పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఫలితంగా అధిక ధరలతో ఎయిర్‌లైన్స్‌కు నష్టాలు తప్పేలా లేవు. ఏదేఏమైనా పథకంలో చేరిన ఎయిర్‌లైన్స్‌కు ఒక రకంగా, చేరని కంపెనీలకు మరొక రకంగా నష్టాలే మిగులుతున్నాయని ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ మాట.

# భారత కంపెనీలపై కెన్యా 'సఫారీ'!





కెన్యాలోని కజియాడో కౌంటీలోని మగాడి సరస్సు వద్ద టాటా కెమికల్స్ మగాదీ లిమిటెడ్(టీసీఎంఎల్) సోడా యాష్ గనులను నిర్వహిస్తోంది. శతాబ్దంపైగా చరిత్ర గల ఈ గనులను 2005లో బ్రిటన్‌కు చెందిన బర్నర్ మాండ్ నుంచి కొనుగోలు చేయడం ద్వారా టాటా కెమికల్స్ కెన్యాలోకి అడుగుపెట్టింది. 100 ఏళ్ల మైనింగ్ హక్కులను దక్కించుకుంది. ఇక్కడ ఉత్పత్తి చేసే సోడా యాష్‌ను గ్లాస్, డిటర్జెంట్లతో సహా రకరకాల పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తుంటారు. ఈ ఖనిజం విదేశాలకూ భారీగా ఎగుమతవుతోంది. అయితే, ఈ ఏడాది జూలై 28న మైనింగ్ క్యాబినెట్ సెక్రటరీ హాసన్ జోహో టీసీఎంఎల్ మైనింగ్ కార్యకలాపాలను సస్పెండ్ చేయడంతో గొడవ మొదలైంది. మైనింగ్ లైసెన్సులతో పాటు ఇతరత్రా నిబంధనలను ఉల్లంఘించిందనేది గనుల శాఖ ఆరోపణ. అంతేకాదు, రాయల్టీలు, ఖనిజ శుద్ధి, ఎగుమతుల రిపోర్టింగ్, కమ్యూనిటీ అభివృద్ధికి సంబంధించి కూడా పలు ప్రశ్నలను లేవనెత్తింది. ముఖ్యంగా టాటా కెమికల్స్ ఇక్కడ గనుల నుంచి వెలికితీస్తున్న ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసేందుకు తగినన్ని ఫ్యాక్టరీలను పెట్టకుండా, ఎగుమతి చేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అయితే, మైనింగ్ శాఖ సస్పెన్షన్ ఆదేశాలపై కెన్యా హైకోర్టులో సవాలు చేసినా టాటాలకు ఊరటదక్కలేదు.

**రూటో అల్టిమేటం..**

కెన్యా అధ్యక్షుడు విలియం రూటో టాటా కెమికల్స్ తమ దేశాన్ని విడిచిపోవాలంటూ అల్టిమేటం జారీ చేయడంతో వివాదం మరింత ముదిరింది. టాటా దశాబ్దాలుగా తమ దేశంలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నప్పటికీ.. తగినన్ని ఫ్యాక్టరీలను నెలకొల్పలేదని, స్థానికంగా ఎలాంటి పారిశ్రామిక ప్రగతీ లేదని రూటో విరుచుకుపడ్డారు. ప్రజలకు టాటా కెమికల్స్ వల్ల పైసా ప్రయోజనం లేదని, అందుకే ఈ ప్రాంతంలో గ్లాస్, కెమికల్ తయారీ ఫ్యాకర్టీల కోసం ప్రభుత్వం రెండు కంపెనీలను నెలకొల్పుతుందన్నారు. టాటాల వ్యాపారాన్ని ఆ కంపెనీలు టేకోవర్ చేస్తాయని ప్రకటించారు. గతంలో కూడా ఇక్కడ టాటాలతో గొడవ నడిచింది. భూమి ధరలు, రాయల్టీలకు సంబంధించి తమకు 17.4 బిలియన్ కెన్యన్ షిల్లింగ్లను చెల్లించాలంటూ కిజియాడో కౌంటీ కోర్టుకెక్కింది. అయితే, దీనిపై టాటాలకు అనుకూలంగా తీర్పురావడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. ఇప్పుడు ఏకంగా అధ్యక్షుడే టాటాలను దేశం నుంచి వెళ్లగొట్టే చర్యలకు తెరతీయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో సంబంధిత ప్రభుత్వ యంత్రాంగాలు, కోర్టులే టాటా కెమికల్స్ కెన్యా వ్యాపార భవిష్యత్తును తేల్చాల్సిన పరిస్థితి నెలకొంది. మగాడి గనుల సస్పెన్షన్ ఆదేశాల నేపథ్యంలో కెన్యా గనుల శాఖ కోరిన సమాచారం, డాక్యుమెంట్లు, రిపోర్టులు అన్నీ ఇప్పటికే సమర్పించామని టాటా కెమికల్స్ శుక్రవారం స్టాక్ ఎక్స్చేంజీలకు వెల్లడించింది. నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగం నుంచి తదుపరి ఆదేశాల కోసం వేచిచూస్తున్నట్లు తెలిపింది. వివాదాస్పద అంశాల పరిష్కారం కోసం న్యాయపరంగా, నియంత్రణపరంగా కెన్యా ప్రభుత్వంతో కలిసి తగిన చర్యలు చేపట్టడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది. తమ ఉద్యోగులు, మగాదీ ప్రజల శ్రేయస్సుతో పాటు కెన్యా ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత కొనసాగుతుందని కూడా స్పష్టం చేసింది.

అదానీ: నైరోబీ జోమో కెన్యాటా ఇంటర్నేషనల్ ఎయిర్–పోర్టు (జేకేఐఏ) ఆధునీకరణ ప్రాజెక్టును (1.85 బిలియన్ డాలర్లు) 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ 2024లో దక్కించుకుంది. వ్యూహాత్మక జాతీయ ఆస్తులను విదేశీ కంపెనీలకు కట్టబెడితే ఉద్యోగాలు పోతాయంటూ కెన్యాలోని విమానయాన యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకించాయి. మరోపక్క, అదానీ ఎనర్జీ, కెన్యా ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కంపెనీతో 30 ఏళ్ల పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు విలువ 736 మిలియన్ డాలర్లు. అమెరికాలో గౌతమ్ అదానీపై లంచాల కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రూటో ఈ రెండు అదానీ ప్రాజెక్టులను రద్దు చేశారు. అయితే, ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు రద్దు వెనుక చైనా హస్తంపై అనుమానాలున్నాయి. ఎందుకంటే 1.2 బిలియన్ డాలర్లతో చైనా రోడ్ అండ్ బ్రిడ్జ్ కార్పొరేషన్ జేకేఐఏ విస్తరణకు ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం.

ఎస్సార్: 2008లో ఎస్సార్ తన యూమొబైల్ టెలికం వ్యాపారాన్ని కెన్యాలో ప్రారంభించింది. 40 బిలియన్ కెన్యన్ షిల్లింగ్స్ పెట్టుబడులు పెట్టింది. అయితే, నష్టాల కారణంగా 2014లో దీన్ని ఎయిర్‌టెల్, సఫరీకామ్‌లకు విక్రయించింది. ఇక కెన్యా పెట్రోలియం రిఫైనరీస్‌లో 50 శాతం వాటాను ఎస్సార్ ఎనర్జీ 2016లో కెన్యా ప్రభుత్వానికి 5 మిలియన్ డాలర్లకు వదిలేసి వైదొలగింది. కెన్యా ప్రభుత్వ ప్రతికూల పాలసీలే దీనికి కారణమనేది ఎస్సార్ ఆరోపణ.



# అంతా రాములోరు చూస్కుంటారు..

యువ హీరో సంగీత్ శోభన్, అనస్వర రాజన్ జంటగా నటిస్తున్న వినోదాత్మక ప్రేమకథ 'అంతా రాములోరు చూస్కుంటారు'. పల్నాటి సూర్యప్రతాప్ దర్శకుడు. ధీరజ్ మొగిలినేని, గిరిబాబు వల్లభనేని నిర్మాతలు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు.ప్రపంచ పటాలు పరిశీలించండి

గోదావరి నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇదని, ఆడియన్స్ తప్పకుండా ఈ సినిమాలో ప్రేమలో పడిపోతారని నిర్మాత ధీరజ్ మొగిలినేని చెప్పారు. 'అంతా రాములోరు చూస్కుంటారు' అనే టైటిల్ తాము ఊరికే పెట్టలేదని, దాని వెనుక కాన్సెప్ట్ ఉందని దర్శకుడు పల్నాటి సూర్యప్రతాప్ తెలిపారు. 'ఇందులో నా పేరు మారుతి. జీవిత భారమంతా రాముడిపై వదిలేసి బతికే యువకుడిగా కనిపిస్తా. ఇది అనుభూతిని పంచే ప్రేమకథ' అని హీరో సంగీత్‌శోభన్ పేర్కొన్నారు.

# అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది

గత ఏడాది 'ఓజీ' చిత్రంతో తెలుగులో మంచి విజయాన్ని దక్కించుకుంది తమిళ సొగసరి ప్రియాంక మోహన్. తాజాగా ఈ భామ తమిళంలో మరో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. శింబు 'అరసన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైంది. ఈ విషయాన్ని ఓ అవార్డు వేడుకలో వెల్లడించింది ప్రియాంక మోహన్. వెట్రిమారన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది. 'వెట్రిమారన్ మేకింగ్‌స్టైల్ నాకు చాలా ఇష్టం. ఆయన ఎంచుకునే కథలు కూడా వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. 'అరసన్'లో నా పాత్ర మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుంది. అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ సినిమా కోసం నేను నార్త్ చెన్నై తాలూకు యాసను నేర్చుకున్నా' అని చెప్పింది ప్రియాంక మోహన్. 'అరసన్' చిత్రంలో విజయ్ సేతుపతి, ఆండ్రియా జెరేమియా, సముద్రఖని తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్నారు.





# జూ. ఎన్టీఆర్ కోసం క్యూ కడుతున్న బాలీవుడ్ స్టార్స్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాపై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే అనీల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలోకి మరో బాలీవుడ్ స్టార్ ఎంట్రీ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ 'డ్రాగన్'లో పవర్‌ఫుల్ విలన్‌గా కనిపించనున్నాడట. అలాగే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ కూడా సినిమాలో కీలక పాత్ర పోషించనున్నట్లు వార్తలు జోరందుకున్నాయి. నిజానికి డ్రాగన్ సినిమాలోకి అలియాను తీసుకుంటారనే ప్రచారం ఏడాది కిందటే నడిచింది. అయితే ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమా షూటింగ్ మరో రెండు వారాల్లో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఎలాంటి బ్రేకులు లేకుండా షూటింగ్ పూర్తి చేసి, వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి చిత్రీకరణను ముగించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుత సమాచారం ప్రకారం 'డ్రాగన్'ను రెండు భాగాలుగా కాకుండా ఒకే సినిమాగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నెని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



# నాని 'ది పారడైజ్' విడుదల వాయిదా?

నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ది పారడైజ్' విడుదల తేదీపై ఫిలింనగర్‌లో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. మొదట ఈ సినిమాను సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని భావించినప్పటికీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు వీఎఫ్ఎక్స్ వర్క్ కారణంగా ఈ మూవీ రిలీజ్ మరోసారి వాయిదా పడనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. సెప్టెంబర్ 24 నుంచి ఈ చిత్రాన్ని వెనక్కి జరిపి అక్టోబర్ 9వ తేదీకి విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ఫిలిం సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ వాయిదా వార్తలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పష్టత రాలేదు. త్వరలోనే దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



# నా కెరీర్ నాశనం చేసినవారి పతనం చూస్తా

బాలీవుడ్ నటి, మాజీ మిస్ ఇండియా యూనివర్స్ తనూశ్రీ దత్తా సోషల్ మీడియాలో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో కష్టాలకు, కెరీర్‌లో ఎదుగుదలకు అడ్డుపడిన వారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ, తనకు అన్యాయం చేసిన వారు తప్పకుండా పర్యవసానాలు ఎదుర్కొంటారని, వారి పతనాన్ని తాను కళ్లారా చూస్తానని పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నన్ను నా సహజ మార్గం నుంచి పక్కకు తప్పించి, బాధపెట్టిన వారికి చెబుతున్నా, నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలు మళ్లీ అద్భుతంగా పుంజుకుంటాయి. నా తప్పు లేకుండా నన్ను బాధించిన ప్రతి ఒక్కరి పతనాన్ని నేను చూస్తాను" అని తనూశ్రీ రాసుకొచ్చారు. "కర్మ చక్రాలు తిరుగుతున్నాయి. రాబోయే కాలం నాది. నాపై కుట్రలు పన్ని, నన్ను మానసికంగా హింసించి, నాపై నిఘా పెట్టి దాడి చేసిన ఆ దుర్మార్గులు భయంకరమైన శక్తుల చేతిలో చిక్కి శాశ్వతంగా వేధింపులకు గురవుతారు. వాళ్లు చేసిన పాపాలకు వాళ్లే పశ్చాత్తాపపడతారు. వాళ్ల జీవితాలు వాళ్ల కళ్ల ముందే నాశనమవుతాయి" అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు. గత నెలలో కూడా తనూశ్రీ తన కెరీర్‌ను కొందరు ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. "శత్రు శిబిరానికి చెందిన కొందరు వ్యక్తులు" తనకు పని అవకాశాలు రాకుండా అడ్డుకుంటున్నారని, తనకు మంచి ప్రాజెక్టులు, బ్రాండ్‌ల నుంచి ఆఫర్లు వచ్చినా వాటిని తప్పుదారి పట్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన చవీమశీశీ ఉద్యమంలో తనూశ్రీ దత్తా కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2008లో 'హార్న్ ఓకే ప్లీజ్' సినిమా చిత్రీకరణ సమయంలో సీనియర్ నటుడు నానా పటేకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేశారు. అప్పటి నుంచి, ఇండస్ట్రీలో తనకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆమె పలు సందర్భాల్లో గళం విప్పుతూనే ఉన్నారు.

# గన్స్‌కి గట్స్ ఉండాలి!

అగ్ర హీరో బాలకృష్ణ నటిస్తున్న 111వ చిత్రానికి 'దాదా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ మాస్ అవతారంలో గ్యాంగ్‌స్టర్ వైబ్‌తో కనిపిస్తున్నారు. 'నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు. బుల్లెట్స్‌కి బలుపు, గన్స్‌కి గట్స్ ఉండాలి' అంటూ బాలకృష్ణ చెప్పిన సంభాషణ ఆకట్టుకునేలా ఉంది. మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, రచన-దర్శకత్వం: గోపీచంద్ మలినేని.



# శుభం కోరుకునే 'కామ్రేడ్ కళ్యాణ్'

"కామ్రేడ్' అంటే స్నేహితుడు. కళ్యాణ్ అంటే శుభం. ఎప్పుడూ పక్కవారి శుభం కోరుకునే స్నేహితుడన్నమాట. ఈ సినిమా ఫస్టాఫ్ అంతా సరదాగా ఉంటుంది. నెమ్మదిగా కథలోకి వెళ్లాక సత్య ఎంటరవుతాడు. అక్కడ్నుంచి చాలా వెరైటీ ఫన్ ఉంటుంది. ఈ సినిమా అందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. ఆయన కథానాయకుడిగా రానున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకిరామ్ మారెళ్ల దర్శకుడు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మాతలు. అక్టోబర్ 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, అగ్ర రచయిత విజయేంద్రప్రసాద్, దర్శకులు బాబీ, శివ నిర్వాణ, వీఎన్ ఆదిత్య, నందినీరెడ్డి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రానికి బృందానికి శుభాకాంక్షలు అందించారు.



Printed, Published & Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com